
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కరీంనగర్

5 జిల్లా వార్తలు

మంగళవారం 29 అక్టోబరు 2024



మార్కెట్‌లో దీపావళి సందడి

◆ కరీంనగర్ కల్చరల్, ఆంధ్రజ్యోతి

7

రేపు ధన్‌తేరాస్

● బంగారం దుకాణాల్లో సందడి

◆ కరీంనగర్ కల్చరల్, ఆంధ్రజ్యోతి





దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

ప్రజావాణికి 184 దరఖాస్తులు

సుభాష్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి 184 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

● **అధికారుల తప్పుడు నివేదిక వల్ల నష్టపోతున్నాం...**

-చెంచు కనకయ్య, గొల్లపల్లి

అధికారుల తప్పుడు నివేదిక వల్ల తాము నష్టపోతున్నామని శంకరపట్నం మండలానికి చెందిన కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గొల్లపల్లికి చెందిన చెంచు కనకయ్య మాట్లాడుతూ తనకు మొలంగూరు శివారులోని 717/ఎ/ఎలో ఎకరం 9 గుంటల వ్యవసాయ భూమి ఉందని తెలిపారు. అందులో నుంచి జాతీయ రహదారి నిర్మిస్తున్నారని, అందులో తన ఇల్లుతోపాటు 12 గుంటల భూమిని కోల్పోయానన్నారు. ఆ భూమికి సంబంధించిన పరిహారం తమకు ఇంతవరకు ఇవ్వలేదని తెలిపారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తమ భూమి వద్దకు వచ్చి పంచనామా నిర్వహించి ఆ భూమి తమదేనని అన్నారని, అధికారులకు తప్పుడు నివేదిక అందించారన్నారు. రెండు సంవత్సరాలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికి తమకు న్యాయం చేయడంలేదన్నారు. తనకు న్యాయం చేయాలని కుటుంబంతో సహా ప్రజావాణికి వచ్చి కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. కలెక్టర్ వెంటనే స్పందించిన ఈ విషయాన్ని పరిశీలించాలని ఆర్డీవోను ఆదేశించారు.

రేపు పౌర హక్కుల దినోత్సవ సభలు

గణేష్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఈ నెల 30న పౌర హక్కుల దినోత్సవ సభలు నిర్వహించనున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ ఉప సంచాలకుడు ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్, పోలీస్ సిబ్బంది, షెడ్యూల్ కులాల హాస్టల్ అధికారి ఆధ్వర్యంలో సభలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు.



కొత్తపల్లి మండలం మల్కాపూర్ కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం



కేంద్రాలు తెరిచారు.. కొనుగోళ్లు మరిచారు..

- పేరుకుపోతున్న ధాన్యం
- మద్దతు ధర రాకున్నా ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్న రైతులు
- క్వింటాల్‌కు రూ. 300 నుంచి 400 వరకు నష్టం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

వరి కోతలు ముమ్మరంగా సాగుతూ ధాన్యం పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలకు వస్తోంది. కేంద్రాల్లో కొనేవారు లేరు. 15 రోజుల క్రితమే జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అన్ని గ్రామాల్లోనూ రైతులు పంట నూర్పిడి చేసుకుని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వస్తున్నారు. ధాన్యం కొనేవారు లేక కల్లాల్లోనే రైతులు పడిగాపులు కాయాల్సి వస్తున్నది. కస్టమ్ మిల్లింగ్ విషయంలో ప్రభుత్వంతో రైస్‌మిల్లర్లకు అవగాహన కుదరలేదు. దీంతో కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎక్కడికి తరలించాలో తెలియని స్థితి నెలకొంది. జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలన్నీ వరి ధాన్యంతో నిండిపోగా పంట నూర్పిడి చేసుకున్న రైతులు మిగతా ధాన్యాన్ని గ్రామం చుట్టూరా ఉన్న రోడ్లపై, ఇతర మైదానాల్లో ఆరబోసుకుంటున్నారు. ధాన్యానికి రక్షణ లేక రైతులు ఇబ్బందిపడుతున్నారు. వర్షాలు కురిస్తే ధాన్యం తడుస్తుందని ఆందోళన చెందుతున్నారు. దీంతో కొందరు రైతులు మద్దతు ధర కంటే క్వింటాల్‌కు 300 నుంచి 400 వరకు తక్కువకు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు.

● **జిల్లాలో 2.75 లక్షల ఎకరాల్లో వరిసాగు**


జిల్లాలో ఈ సీజన్‌లో 2,75,448 ఎకరాల్లో వరిసాగు చేశారు. వీటిలో 1,56,948 ఎకరాలు దొడ్డు రకాలు, 1,18,500 ఎకరాల్లో సన్న రకాలను వేశారు. ప్రభుత్వం సన్నరకాల సాగును ప్రోత్సహించాలని నిర్ణయించి క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ప్రకటించడంతో ఈసీజన్‌లో 40 శాతానికిపైగా సన్నరకాలను సాగు చేశారు. దొడ్డు రకాలకు చెందిన వరి ధాన్యం దిగుబడి ఎకరాకు 2.092 టన్నులు, సన్నరకాలు 2.047 టన్నులు వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈ మేరకు 3,28,335 మెట్రిక్ టన్నుల దొడ్డు వరి ధాన్యం, 2,42,570 మెట్రిక్ టన్నుల సన్న రకం వరి ధాన్యం దిగుబడిగా రానున్నది. దొడ్డు రకాలు మొత్తంగా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించనుండగా సన్నరకాల్లో 55,374 మెట్రిక్ టన్నులు రైతులు విత్తన అవసరాల కోసం, 75,471 టన్నులు స్థానిక అవసరాల కోసం ఉంచుకొని 1,11,725 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తారని అంచనా వేశారు. జిల్లాలో రైతులు మొత్తంగా 4,14,282 మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయించే అవకాశముండడంతో వీటిని కొనుగోలు చేయడానికి 340 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించి సగానికిపైగా ప్రారంభించారు. ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు 2,320, కామన్ రకానికి 2,300 రూపాయల మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించింది. సన్నరకం ధాన్యానికి 2,320తోపాటు 500 రూపాయల

మిగతా 8వ పేజీలో...



ఇల్లందకుంటలో వరిధాన్యం కొనుగోలు కేంద్రం

కొనుగోళ్లను త్వరగా ప్రారంభించాలి



- తొంట సమ్మయ్య, జాగీర్‌పల్లి

వర్షాలు కురిస్తే ధాన్యం తడిసి మొలకెత్తి రైతులు నష్టపోయే అకాశముంది. త్వరగా ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించి మద్దతు ధర ఇవ్వాలి

రూ.500 బోనస్‌పై స్పష్టత ఇవ్వాలి



- పిన్‌రెడ్డి రమణారెడ్డి, కన్నాపూర్

కల్లాల వద్ద ధాన్యం ఆరబోసినం. ఇప్పటి వరకు కాంటాలు వేయలేదు. వేరే పని చేసుకోకుండా రోజంతా ఇక్కడే ఉండాల్సి వస్తుంది. సన్నవడ్లకు ప్రభుత్వం 500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. ఇప్పటి వరకు దానిపై స్పష్టత రాలేదు. ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి.

12 రోజులుగా ధాన్యం ఆరబెడుతున్నా..



- మేడిపల్లి రాములు, సైదాబాద్

నేను ఆరెకరాల్లో దొడ్డు రకం వరి సాగు చేశాను. 12 రోజుల క్రితం ధాన్యాన్ని జమ్మికుంట మార్కెట్‌కు తెచ్చాను. ఎప్పుడు కొంటారని అధికారులు చెప్పడం లేదు. రేపు, మాపు అంటూ దాటవేస్తున్నారు. వర్షం వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. వర్షం పడితే తేమశాతం పెరుగుతుంది.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి

● పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థులు, కార్యకర్తలు

సుభాష్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్ యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్, కార్యదర్శి ముల్కల మారుతి డిమాండ్ చేశారు. సోమవారం పీడీఎస్ యూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. మూడు సంవత్సరాల నుంచి విద్యార్థులకు రావాల్సి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకుండా కాలయాపన చేస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ వల్ల విద్యారంగం విధ్వంసానికి గురైందన్నారు. కేసీఆర్ అడుగుజాడల్లోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నడుస్తున్నట్లుగా ఉందన్నారు. విద్యారంగానికి సరిపడా బడ్జెట్ కేటాయించకపోవడమే కాకుండా మూడు సంవత్సరాల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగి డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థుల సర్టిఫికెట్లు ప్రైవేటు కళాశాల యాజమాన్యాల వద్దనే ఉండడం వల్ల ఉన్నత చదువులకు వెళ్లలేని పరిస్థితి లేకపోయిందని వాపోయారు. స్కాలర్‌షిప్ రాకపోవడంవల్ల రాష్ట్రంలోని కొన్ని ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలు మూసివేసే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను విడుదల చేయాలని, లేకపోతే ఎమ్మెల్యే, మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి రాజశేఖర్, జిల్లా నాయకులు అంజనిప్రసాద్, అరవింద్, చరణ్, పవన్, వినయ్, జ్యోతి, శృతి, శ్రావణి, అంజలి పాల్గొన్నారు.

మానేరుపై బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన



చొక్కారావుపల్లిలో మానేరువాగు వద్ద బ్రిడ్జి నిర్మాణం కోసం పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి, కలెక్టర్, అడిషనల్ కలెక్టర్

గన్నేరువరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చొక్కారావుపల్లి శివారు నుంచి కరీంనగర్ వెళ్లేందుకు మానేరుపై బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతంలో 500 మీటర్ల వరకు బ్రిడ్జి నిర్మించాల్సి ఉంటుందని గుర్తించారు. దీనిపై అధికారులు సర్వే చేసిన మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి బ్రిడ్జి నిర్మాణానికి అవసరమయ్యే నిధులపై ప్రతిపాదనలు సిద్ధం చేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని తెలిపారు. మైలారం నుంచి కరీంనగర్‌కు లాంచ్ ఏర్పాటు చేయాలని కోరుతూ డీసిసి ఉపాధ్యక్షుడు కొమ్మెర రవిందర్ రెడ్డి ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు.

● **ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం**

మండలంలోని మాదాపూర్, గన్నేరువరం, చొక్కారావుపల్లి గ్రామాలలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన 17 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్అండ్‌బి ఈఈ సాంబశివరావు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్కూరి అనంతరెడ్డి, ఉపాధ్యక్షుడు కొమ్మెర రవిందర్‌రెడ్డి, కార్యదర్శి బొడ్డు సునీల్ పాల్గొన్నారు.

ఎన్‌జీవోలందరూ సభ్యత్వం నమోదు చేసుకోవాలి



సభ్యత్వాన్ని అందచేస్తున్న టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి నాయకులు

సుభాష్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారులందరూ టీఎన్‌జీవోస్ సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్టేట్ ఆడిట్, పోలీస్ మినిస్టీరియల్, అటవీశాఖ, వైద్య ఆరోగ్యశాఖల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఒక డీఏతో ఉద్యోగులు సంతృప్తిగా లేరన్నారు. పీఆర్సీ పెండింగ్‌లో ఉందన్నారు. ఉద్యోగుల కాంట్రిబ్యూషన్‌తో కూడిన ఎంప్లాయీస్ హెల్త్ స్కీంను వెంటనే అమలు చేయాలన్నారు. ఉద్యోగులు తమ పిల్లల పెళ్లిళ్లు, వైద్య ఖర్చులకోసం పెట్టుకున్న జీపీఎఫ్ లోన్లను వెంటనే ఇప్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కుబేర్ లాంటి అశాస్త్రీయమైన విధానాన్ని రద్దు చేసి జిల్లా ట్రెజరీల స్థాయిలోనే చెల్లింపులు చెల్లించే పాత విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక చాల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, కోశాధికారి ముప్పిడి సునీల్‌కుమార్‌రెడ్డి, సర్దార్ హర్మిందర్‌సింగ్, రాజేశ్ భరద్వాజ్, ఏవీ రాజేశ్వర్‌రావు, రాధాకృష్ణారెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో విద్యుత్ దీపాలు వెలుగకపోవడంతో చీకటిగా ఉన్న జమ్మికుంట రోడ్డు

అలంకారప్రాయంగా సెంట్రల్ లైటింగ్

- చీకట్లో హుజూరాబాద్ ● వెలగని విద్యుత్ దీపాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

హుజూరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ అలంకార ప్రాయంగా మారింది. ప్రస్తుతం విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో హుజూరాబాద్ చీకటిగా మారింది. ఆరు నెలలుగా హుజూరాబాద్, హనుమకొండ, కరీంనగర్, సైదాపూర్, జమ్మికుంట రోడ్‌లలో విద్యుత్ దీపాలు వెలుగకా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదంతా తెలిసినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. బల్బులు పాడైపోయినా వాటి స్థానంలో కొత్తవి పెట్టడం లేదు. విద్యుత్ దీపాలు వెలుగకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. విద్యుత్ దీపాలను కాలిపోయిన చోట పెట్టేందుకు గత ప్రభుత్వ హయాంలో ఒక ఏజెన్సీకి అప్పగించారు. ఆ ఏజెన్సీ వారు వీటి గురించి పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో కూడా విద్యుత్ దీపాలు వెలుగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, మున్సిపల్ అధికారులు స్పందించి కాలిపోయిన చోట విద్యుత్ దీపాలు వెలిగేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ధరల్లో కోత పెడితే సహించేది లేదు

జమ్మికుంట రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పత్తి ధరల్లో కోత పెడితే సహించేది లేదని మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం వ్యాపారులు హెచ్చరించారు. మార్కెట్ కార్యాలయంలో ఖరీదు దారులు, అడ్తీదారులతో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి రోజు మార్కెట్ యార్డులో బహిరంగ వేలం పూర్తయిన తర్వాతే ఖరీదుదారులు, అడ్తీదారులు బయటకు వెళ్లాలని సూచించారు. ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలన్నారు. పత్తి నాణ్యత గురించి రైతులకు వివరించాలని, వారితో మాట్లాడి ధరలు నిర్ణయించాలన్నారు.

● **రూ. 6,700 పలికిన పత్తి ధర**

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 6,700 రూపాయలు పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 167 మంది రైతులు 1,869 క్వింటాళ్ల విడి పత్తి వచ్చింది. వ్యాపారులు బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర 6,700, కనిష్ఠ ధర 5,800 రూపాయలు చెల్లించారు.

వంటే వారికి ఉపాధి

● బంధనకల్ గ్రామస్థుల వంటలకు భలే డిమాండ్ ● మొదట ఒకరిద్దరితో ప్రారంభం ● ప్రస్తుతం 200 మందికిపైగా ఉపాధి



వంటలు చేస్తున్న యువకులు

విందు ఏదైనా బందనకల్ వంటలకు ఉన్న క్రేజే వేరు. వివాహాది శుభకార్యాలతోపాటు సభలు, సమావేశాల్లో ఆ గ్రామస్థుల వంటలకు ప్రత్యేకత గుర్తింపు. మొదట గ్రామానికి చెందిన ఒకరిద్దరు వంటలు చేస్తూ ఉపాధి పొందారు. రోజురోజుకు ఆర్డర్లు పెరగడంతో గ్రామంలోని మరికొంత మందిని జత చేసుకున్నారు. డిగ్రీలు చదువుకున్న వారి పిల్లలు కూడా ఉద్యోగావకాశాల కోసం ప్రయత్నిస్తూనే వంటలు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం గ్రామంలో 200 మంది బృందాలుగా ఏర్పడి వివిధ ప్రాంతాల్లో వంటలు చేస్తూ ఔరా అనిపిస్తున్నారు.

ముస్తాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండలంలోని బందనకల్ గ్రామస్థులు వంటలు చేయడంలో సిద్ధహస్తులు. వివాహాది, శుభకార్యాలతో పాటు పార్టీల సభలు, సమావేశాల్లో వీరి వంటలకు ప్రత్యేక గుర్తింపు. 30 ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన చిగురు మల్లేశం అటెండర్‌గా పని చేస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో చిన్నచిన్న సమావేశాలు, విందులకు వంటల చేసేవాడు. ఆయన చేసే వంటలు బాగుండడంతో ఆర్డర్లు రావడం పెరిగింది. దీంతో గ్రామానికి చెందిన చిగురు రాములు, రాజయ్య, మల్లయ్య నారాయణ జతకట్టారు. ఎక్కడ శుభ కార్యాలు జరిగినా మల్లేశం బృందం ఉండేది. బందనకల్ నుంచి హైదరాబాద్ వంటి పట్టణాలకు వెళ్లి వంటలు చేసి వచ్చేవారు. అనంతరం వారి పిల్లలు కూడా చదువుతోపాటు వంటలు చేయడం నేర్చుకున్నారు. ఓ వైపు డిగ్రీలు, పీజీలు చదువుతూ వంటల్లో ఆరి తేరారు. బృందాలుగా ఏర్పడి వంటలు చేయడం ప్రారంభించారు.

ఇలా గ్రామంలో 200 మందికిపైగా వంటలు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. సాధారణ సమయాల్లో విడివిడిగా వంటలు చేసినా పెద్ద ఆర్డర్లు వచ్చిన సందర్భాల్లో వీరంతా ఒక్కటవుతారు. పది వేల మందికి అవలీలగా వంటలు చేస్తారు. విందులు, శుభకార్యాలు, రాజకీయ పార్టీల సభలు, సమావేశాలకు సంబంధించిన ఆర్డర్లు ముందుగా ఇక్కడి యువతకే వస్తాయి. మాజీ సీఎం కేసీఆర్, మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ నుంచి సైతం ప్రశంసలు అందుకున్నారు.

కష్టపడే తత్వాన్ని అలవర్చుకున్న

చిగురు మధు, బంధనకల్



డిగ్రీవరకు చదువుకున్నా. చదువుకునే రోజుల్లోనే కష్టపడే తత్వాన్ని అలవర్చుకున్నా. భవిష్యత్ సాఫీగా ఉండాలని భావించా. మా పెద్దల దగ్గర వంటలు చేయడం నేర్చుకున్నా. వందల వేల సంఖ్యలో పెద్ద పెద్ద కార్యక్రమాలు చేశాం. కేసీఆర్, సీహెచ్ విద్యా సాగర్‌రావు, కేటీఆర్ వంటి ప్రముఖులు మా వంటల రుచులు చూశారు.

ఇదో ఆదాయ వనరు

: జెల్ల నాగరాజు, బంధనకల్



పాకశాస్త్రానికి మంచి ఆదరణ ఉంది, శుభాకార్యలు ఎల్లప్పుడూ ఉంటాయి. తద్వారా వంటలకు ఆర్డర్లు లభిస్తుంటాయి. చదువులకు ఆటంకం కలుగకుండా జాగ్రత్తలు తీసుకొని వంటల్లో ప్రావీణం పొందాం. దాదాపు పది వేల మందికి పైగా అవలీలగా వంటలను రుచికరంగా అదిస్తాం.

సీనియర్ల సహకారంతో వంటలు నేర్చుకున్నా..

ప్రతాప్, బంధనకల్



సీనియర్ల సహకారంతో వంటలు నేర్చుకున్నా. ఎంబీఏ పూర్తి చేశాను. ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తూనే వంటలు నేర్చుకోవడానికి సీనియర్ల వెంట వెళ్లా. ప్రస్తుతానికి ఇదే వృత్తిగా మారింది. దీని ద్వారా ఉపాధి పొందుతున్నా.

పెద్దల నుంచి నేర్చుకున్నా : పండరి, బంధనకల్



డిగ్రీ వరకు చదువుకున్నాను. ఉద్యోగావకాశాల కోసం వేచి చూడకుండా మా పెద్దల వెంట వెళ్లి వంటలు నేర్చుకున్నా. ఎలాంటి వంటలైనా చేస్తాం. అతిథులు వంటలు బాగున్నాయని కితాబిస్తే సంతోషంగా ఉంటుంది.

అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్య

పెద్దపల్లి జిల్లా నాగారంలో ఘటన



సుజాత, శంకర్‌గౌడ్ (ఫైల్)

మంథని, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని నాగారం గ్రామంలో అనారోగ్య కారణాలు, ఆర్థిక ఇబ్బందులతో భార్యభర్తలు సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బొడిగె శంకర్‌గౌడ్ (50), సుజాత (45)లు భార్యాభర్తలు. శంకర్‌గౌడ్ గీత కార్మికుడిగా, వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. భార్య సుజాత పది సంవత్సరాలుగా వెన్నుపూస నొప్పితో బాధపడుతోంది. ఐదు సంవత్సరాల క్రితం ఆపరేషన్ జరిగింది. అయిన పట్పటికి నొప్పి తగ్గలేదు. ఇటీవల వైద్యులను సంప్రదించగా మళ్లీ ఆపరేషన్ చేయించాలని సూచించారు. దీంతో ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతన్న దంపతులు మానసిక ఆందోళనకు గురై ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సాయంత్రం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించడంతోపాటు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వీరికి ముగ్గరు కూతుళ్ల ఉండగా వారికి వివాహం చేశారు.

పాఠశాల ఆవరణలో పాముల సంచారం

● మైదానంలోని నర్సరీలో ఆవాసం

● భయాందోళనలో విద్యార్థులు



పాఠశాల ఆవరణలో సంచరిస్తున్న పాము

తంగళ్లపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పాముల సంచారంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. సోమవారం పాఠశాల మైదానంలో పాము కనిపించ డంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. మైదానంలో పాము అటు ఇటు తిరగడంతో పరుగులు పెట్టారు. కొద్ది సేపటికి పాము వెళ్లిపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. పాఠశాల ఆవరణలో నర్సరీ ఏర్పాటు చేయడంతో పాములు అందులో ఆవాసం ఏర్పాటు చేసుకున్నాయని, తరచూ పాఠశాలలో సంచరిస్తున్నాయని విద్యార్థులు, స్థానికులు పేర్కొంటున్నారు. పాఠశాల ఆవరణ నుంచి నర్సరీని తొలగించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా నర్సరీని మరోచోటుకు తరలించాలని కోరుతున్నారు.

పెన్షన్ ఇప్పిస్తానని బంగారు గొలుసు చోరీ



బాధితురాలు చంద్రకళ

జమ్మికుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ ఇప్పిస్తానని మాయా మాటలు చెప్పి వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి ఎత్తుకెళ్లాడు. జమ్మికుంట పట్టణానికి చెందిన సూదం చంద్రకళ ఉదయం 11గంటల సమయంలో శివాలయానికి వెళ్లేందుకు సురక్ష ఆసుపత్రి రోడ్డులో వెళుతోంది. ఆమె వద్దకు ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి అమ్మ మీకు పెన్షన్ వస్తుందా అని అడిగాడు. లేదని ఆమె చెప్పింది. తాను ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఫొటో తీసుకోవాలి, మెడలో ఏం ఉండకూడదని అని చెప్పాడు. ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు తీసుకున్నాడు. సెల్‌ఫోన్‌లో ఫొటో తీసి ఇక్కడే ఉండు.. ఫొటో ప్రింట్ తీసుకుని వస్తానని చెప్పి అక్కడి నుంచి ఉడాయించాడు. కొద్దిసేపు వేచి చూసిన చంద్రకళ అతడు రాకపోయేసరికి మోసపోయానని గ్రహించింది. రోదిస్తూ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల సహకారంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

హనుమాన్ విగ్రహం ధ్వంసం

గుర్తు తెలియని వ్యక్తుల పనే అంటూ భక్తుల రాస్తారోకో

బీర్‌పూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ లక్ష్మీనరసింహ స్వామి స్వాగత తోరణానికి కుడి వైపున ఉన్న హనుమాన్ విగ్రహం ధ్వంసం అయి పడి ఉండడంతో మండలంలోని హిందూ సంఘాల నాయకులు, హనుమాన్ భక్తులు సోమవారం ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న జగిత్యాల సీఐ కృష్ణారెడ్డి, బీర్‌పూర్ ఎస్సై కుమార స్వామి సంఘటనా స్థలానికి చేరుకొని విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని పట్టుకొని చట్టపరంగా శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

ఆలయ స్వాగత తోరణానికి కుడివైపు ఉన్న హనుమాన్ విగ్రహం ధ్వంసం చేశారని అర్చకుడు వొద్దపర్తి సంతోషాచార్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సోమవారం సాయంత్రం సుమారు 6గంటలకు బీర్‌పూర్ గ్రామానికి చెందిన అల్లెపు సిద్దార్థ ట్రాక్టర్ నడుపుతుండగా ట్రా క్టర్ ముందు టైరు పంక్చర్ అయి అదుపుతప్పి ప్రమాదవశాత్తు హనుమాన్ విగ్రహాన్ని ఢీకొట్టినట్లు తెలిసిందన్నారు. ఈ ప్రమాదానికి కారకుడైనా అల్లెపు సిద్దార్థను అదుపులోనికి తీసు కొన్నట్లు తెలిపారు. ధ్వంసమైన విగ్రహం స్థలంలో మరో విగ్రహాన్ని ఏర్పాటు చేసి విగ్రహ పునఃప్రతిష్ఠ చేసే విధంగా ఆలయ ఈవో, ఆలయ అర్చకులు, గ్రామ పెద్దల సమక్షంలో ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఈ సంఘటన కేవలం ప్రమాదవశాత్తు మాత్రమే జరిగిందని, ఈ విషయంలో ఎలాంటి పుకార్లను, తప్పుడు కథనాలను నమ్మవద్దని, సోషల్ మీడియాలో పుకార్లు వ్యాప్తి చేయవద్దని పోలీసుల విజ్ఞప్తి చేశారు.



రాస్తారోకో చేస్తున్న హిందూ సంఘాలు

ఇంటికి చేరే లోపే కబళించిన మృత్యువు

● రోడ్డు ప్రమాదంలో భార్య మృతి, భర్త, ఇద్దరు కొడుకులకు గాయాలు

● మృతదేహంతో కుటుంబసభ్యుల ఆందోళన

మంథని, అక్టోబరు 28: తల్లిగారి ఇంటి నుంచి బయలుదేరి కొద్దిసేపట్లో తమ ఇంటికి చేరే క్రమంలో సెగ్గెం శైలజ (24) అనే వివాహితను మృత్యురూపంలో ఇసుక లారీ కబళించగా, భర్త, ఇద్దరు కొడుకులు గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామ శివారులోని గాడుదులగండి గుట్టపై చోటు చేసుకుంది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం..

మండలంలోని అడవిసోమన్‌పల్లి గ్రామానికి చెందిన సెగ్గెం శైలజ, భర్త రాహుల్, ఇద్దరు కవలలతో కలిసి తన తల్లి గారి ఇంటికి మంచిర్యాల జిల్లా వేలాలకు వెళ్లింది. సోమవారం భర్త, పిల్లలతో కలిసి తమ ద్విచక్ర వాహనంపై అడవిసోమన్‌పల్లి గ్రామానికి బయలు దేరారు. గాడుదులగండి గుట్టపై టీఎస్ 02 డీ 8353 అనే లారీ ద్విచక్ర వాహనాన్ని వెనుక వైపు నుంచి ఢీ కొట్టింది. బండిపై వెనకాల కూర్చున్న శైలజ ఒక్కసారిగా కింద పడిపోవడంతో తలకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో భర్త రాహుల్, ఇద్దరు కుమారులకు సైతం తీవ్రంగా గాయాలయ్యాయి.

సంఘటన స్థలంలో శైలజ మృతదేహం వద్ద భర్త రాహుల్ రోదించిన తీరు అందరిని కంటతడి పెట్టించింది. గాయపడ్డ వారిని స్థానికంగా ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం గోదావరిఖనికి తరలించారు. శైలజ మృతిపై కుటుంబసభ్యులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంథని -కాటారం ప్రధాన రహదారిపై మృతదేహంతో ఆందోళనకు దిగారు. ఇసుక లారీలు వేగంగా నడిపిస్తుండటంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని భైఠాయించారు. సంఘటన స్థలానికి ఎస్ఐ రమేష్ చేరుకొని బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం శైలజ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన శైలజ

గోదావరిఖనిలో గాంధీ మార్కెట్ కూల్చివేత

కోల్‌సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మెయిన్ చౌరస్తా సమీపంలోని గాంధీ మార్కెట్‌గా పిలువబడే షాపుల ను సోమవారం రామగుండం నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం కూల్చివేసింది. అదన పు కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ అరుణశ్రీ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది సోమవారం ఉదయం ఈ కూల్చివేతలు జరిపారు. ఈ ప్రాంతంలో సింగ రేణి, మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శాశ్వత షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి వ్యాపారులకు అందుబాటులోకి తీసుకురానున్నా రని తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షాపులను ఖాళీ చేయాలని ఇటీవలే టౌన్ ప్లానింగ్ అధికారులు వ్యాపారులకు సమాచారం ఇచ్చారు. కొందరు ఖాళీ చేయగా మరికొందరు ఖాళీ చేయలేదు. సోమవారం ఉదయం టౌన్ ప్లానింగ్ అధికారులు ఎక్స్‌కవేటర్ తీసుకొని రావడంతో షటర్లలో వ్యాపారం నిర్వహిస్తున్న వారు హడా విడిగా ఖాళీ చేశారు. తరువాత వాటిని నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించారు.

18ఏళ్ల క్రితం తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు...

రామగుండం నగరపాలక సంస్థ పోచమ్మ మైదాన స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సింగరేణి సంస్థ స్థలాన్ని ఇచ్చింది. అప్పటి కూరగాయల మార్కెట్‌తో పాటు పోచమ్మ మైదాన ప్రాంతంలో ఉన్న చిన్న చిన్న దుకాణాలను అప్పటి చైర్మన్ బడికెల రాజలింగం ఆధ్వర్యంలో కూల్చి వేశారు. వారికి తాత్కాలికంగా వ్యాపారాలు చేసుకునేందుకు పునరావాసం క్రింద మున్సిపాలిటీ సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి రైతు బజార్ నిర్వహిస్తున్న స్థలాన్ని అప్పగించింది. ఆరు నెలల్లో ఖాళీ చేస్తామని మున్సిపల్ హామి ఇచ్చి స్థలాన్ని తీసుకున్నది. సుమారు 50మంది యజమానులు, కిరాయిదారులకు కేటాయించారు. పోచమ్మమైదానంలో షాపులు కోల్పోయిన వ్యాపారులు లక్ష్మీనగర్‌లో వ్యాపారాలు చేస్తున్నారు. ప్రస్తుతం గాంధీ మార్కెట్‌లో అప్పుడు షాపులు తీసుకున్న ఒకరిద్దరు వ్యాపారాలు చేస్తున్నారు. అందరు పండ్ల గోడౌన్‌లకు, ఇతర వ్యాపారాలకు కిరాయిలకు ఇచ్చారు. ఈ తాత్కాలిక మార్కెట్ స్థలంలో వ్యాపార సముదాయాన్ని నిర్మించేందుకు షాపులను తొలగించారు.

దొంగతనం కేసులో పలువురికి జైలు శిక్ష

బోయినపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో ఇద్దరికి 17 నెలల జైలు శిక్ష విధిస్తూ వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి సోమవారం తీర్పు వెల్లడించినట్లు బోయినపల్లి ఎస్సై పృథ్వీందర్ గౌడ్ తెలిపారు. బోయినపల్లి మండలం కొదురుపాక ఎల్లమ్మ దేవాలయంలో సంఘ ప్రణయ్, షైక్ సోహెల్ దొంగతనికి పాల్పడ్డారని కొదురుపాకకు చెందిన నాగుల నాగరాజు ఫిర్యాదుతో బోయినపల్లి పోలీస్‌లు కేసు నమోదు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. విచారణ అధికారి మహేందర్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా ఎస్సై రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్ సాక్షులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరుపున విక్రాంత్ కేసు వాదించగా పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి జ్యోతిర్మయి సంఘ ప్రణయ్, షైక్ సోహెల్‌కు 17 నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.


మరో కేసులో 18 నెలల జైలు శిక్ష

వేములవాడ టౌన్ : దొంగతనం కేసులో ఇద్దరికి 18 నెలల జైలు శిక్ష విధిస్తూ వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి సోమవారం తీర్పు వెల్లడించినట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ సోమవారం తెలిపారు. వేములవాడ మండలం రుద్రవరంలోని ఎల్లమ్మ ఆలయంలో దొంగతనం జరిగినట్లు అప్పటి సర్పంచ్ 2023 ఫిబ్రవరి 7న ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. విచారణ అధికారి వెంకట్రాజం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సీఎంఎస్ ఎస్సై రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ సురేష్ సాక్షులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరుపు విక్రాంత్ కేసు వాదించగా న్యాయమూర్తి జ్యోతిర్మయి పూర్వపరాలను పరిశీలించి ప్రణయ్, సోహెల్‌కు 18 నెలల కారాగార జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

సిరిసిల్ల క్రైం: దొంగతనం కేసులో ఒకరికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. సిరిసిల్ల నెహ్రూనగర్ అంబాభవాని ఆలయంలో 27 ఫిబ్రవరి 2017 రాత్రి పూజ అనంతరం గుడికి తాళం వేసి వెళ్లిపోయారు. దొంగ గుడి గేటు తాళం పగులగొట్టి హుండీని ఎత్తుకెళ్లి మానేరు వాగులో పడేశాడు. ఈ సంఘటన పై కేసు నమోదు చేసి దొంగతనం చేసిన మానకొండూరు మండలం ఊటూరుకు చెందిన వడ్డేపల్లి సత్యం (38)ను రిమాండ్‌కు తరలించారు. విచారణ అనంతరం అప్పటి పోలీస్ అధికారి లియకత్ అలి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారి ఎస్సై రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్, ఏడుగురు సాక్షులను ప్రవేశ పెట్టారు. ప్రాసిక్యూషన్ తరుపున పీపీ చెలుముల సందీప్ వాదించారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ సత్యంకు జైలు శిక్ష విధించారు.

విలు విద్యలో రాణిస్తున్న శ్రీహన్స్‌కార్తికేయ

ఎస్ఎఫ్ఏ పోటీల్లో బంగారు పతకం కైవసం



శిక్షణ పొందుతున్న శ్రీహన్స్ కార్తికేయ

ముత్తారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టుమని పదేళ్ల కూడా లేని ఆ బాలుడు విలువిద్యలో రాణిస్తున్నాడు. ఇటీవల జరిగిన స్పోర్ట్స్ ఫర్ ఆల్(ఎస్ఎఫ్ఏ) చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-9 విభాగంగా రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించి పలువురి ప్రశంసలందుకున్నాడు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన లింగం శ్రీహన్స్ కార్తికేయ. ప్రస్తుతం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. శ్రీహన్స్ కార్తికేయ తండ్రి లింగం శ్రీనివాస్ వృత్తిరీత్యా టీచర్ కావడంతో మిత్రుల ద్వారా ఆర్చరీపై ఆసక్తి కలిగింది. దీంతో తన కొడుక్కి మొదట్లో మంథనిలో కోచింగ్ ఇప్పించాడు. కొంతకాలంగా కరీంనగర్‌లోని శ్రీకృష్ణ ఆర్చరీ అకాడమీలో శిక్షణ ఇప్పిస్తున్నాడు. ఈక్రమంలోనే ఈ నెల 15న జరిగిన స్పోర్ట్స్ ఫర్ ఆల్(ఎస్ఎఫ్ఏ) రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీహన్స్ కార్తికేయ పాల్గొని బంగారు పతకం సాధించాడు. రానున్న డిసెంబరులో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాణించేందుకు సాధన చేస్తున్నాడు.



రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించిన శ్రీహన్స్

గంజాయి తరలిస్తున్న వారిపై కేసు నమోదు

ధర్మపురి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని పటేల్ గార్డెన్స్ వద్ద గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గంగుల మహేష్ తెలిపారు. మండలంలోని మగ్గిడి గ్రామానికి చెందిన సల్లూరి రమేష్, మంచిర్యాల జిల్లా జన్నారం గ్రామానికి చెందిన జన్నోజు రాజేష్ అలియాస్ శివ కొంత కాలం నుంచి గంజాయి తాగడం కోసం అలవాటు పడ్డారని ఆయన పేర్కొన్నారు. తమ వద్ద ఉన్న గంజాయిని జల్సాలక అలవాటు పడి ఇతరులకు అమ్మేవారని ఆయన తెలిపారు. ఉదయం తమ వద్ద ఉన్న 500 గ్రాముల గంజాయిని ఇతరులకు విక్రయించేందుకు తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

రుద్రంగి: మండల కేంద్రం శివారులోని గంగమ్మ ఆలయం వద్ద గంజాయి తరలిస్తున్న ఇద్దరిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వేములవాడ మండలానికి చెందిన నాగరాజు, జగన్‌ల వద్ద 120 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తారం గ్రామ పంచాయతీ ధర్మాబాద్‌కు చెందిన ఎండి హుస్సేన్ (28) మద్యానికి బానిసై ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్సేన్ తరచూ మద్యం సేవిస్తుండేవాడు. ఆదివారం మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. కుటుంబసభ్యులను మద్యానికి డబ్బులు కావాలని అడుగగా ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఇంటి దగ్గరలోని చెట్టుకు రాత్రి సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సల్మా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

జమ్మికుంట రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):పట్టణానికి చెందిన ఓ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు సత్యనారాయణపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. సత్యనారాయణ జామకాయ ఇస్తానని చెప్పి బాలికను ఇంట్లోకి తీసుకువెళ్లి అసభ్యంగా ప్రవర్తించగా బాలిక ఏడవడంతో ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించి అక్కడి నుంచి పంపించాడు. ఆ బాలిక ఇంటికి వచ్చి తల్లికి విషయం చెప్పింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

ఎమ్మెల్యే ఇంటి ఎదుట దళిత బంధు లబ్ధిదారుల ధర్నా



ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

వీణవంక, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటి ఎదుట దళితబంధు లబ్ధిదారులు రెండో విడత నిధులు విడుదల చేయాలని సోమవారం ధర్నా నిర్వహించారు. దీంతో బీఆర్ ఎస్ నాయకులు ఎమ్మెల్యేతో ఫోన్‌లో మాట్లాడించారు. దళితబంధు లబ్ధిదా రులతో కలిసి ప్రభుత్వంపై ఆందోళన చేపడతానని ఎమ్మెల్యే వారికి చెప్పడంతో వారు ధర్నాను విరమించారు.

వరుదకాలువలో గల్లంతైన వైద్యుడి మృతదేహం లభ్యం



ఉదయ్‌కిరణ్‌రెడ్డి (ఫైల్)

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం లోని విట్టంపేట గ్రామ శివారులోని వరద కాలువలో గల్లంతైన ప్రైవేటు వైద్యుడు పాకం టి ఉదయ్‌కిరణ్‌రెడ్డి (29)మృతదేహం సోమవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పని చేస్తున్న ఉదయ్‌కిరణ్‌రెడ్డి ఆదివారం తన స్నేహితులతో కలిసి కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈత కొడుతుండగా నీటి ప్రవాహం ఎక్కువ ఉన్న ప్రాంతంలో ఉదయ్‌కిరణ్‌రెడ్డి అందులో మునిగిపోయాడు. నీటి ప్రవాహం ఎక్కువ ఉండడంతో రాత్రి గాలించినా ఆచూకీ తెలియలేదు. సోమవారం ఉదయం వరద కాలువలో కొంత దూరంలో వైద్యుడి మృతదేహం కనిపించింది. కాలువలో నుంచి మృతదేహాన్ని పోలీసులు గ్రామస్థులతో బయటకు తీయించి మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉదయ్‌కిరణ్‌రెడ్డి తండ్రి శ్రీకాంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి స్వగ్రామమైన హనుమకొండ జిల్లా సరసపల్లి మండలంలోని వేలేరులో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు
మెరుగైన వైద్యం అందిస్తాం

మంత్రి శ్రీధర్ బాబు



విద్యార్థినులను పరామర్శిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 28: (ఆంధ్రజ్యోతి) కేజీబీవీలో అస్వస్థతకు గురైన విద్యార్థినులకు పూర్తిస్థాయిలో కోలుకునే వరకు మెరుగైన వైద్యం అందిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు తెలిపారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులు ఆదివారం అస్వస్థతకు గురైన విద్యార్థినులు పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం రాత్రి వరకు విద్యార్థినులు కోలుకున్నారు. వారిలో కొందరు సోమవారం ఉదయం మళ్లీ అస్వస్థతకు గురయ్యారు. వారిని మంత్రి డి శ్రీధర్‌బాబు పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ..

ముత్తారం మండలంలోని కేజీబీవీలో విద్యార్థినులు అస్వస్థతకు గురికాగా జిల్లా ఆసుపత్రికి 53 మందిని తరలించి 10 మంది వైద్యులు, 20 మంది స్టాఫ్ నర్సులు ఆధ్వర్యంలో అత్యుత్తమ చికిత్స అందిస్తున్నామన్నారు. కొంత మంది బాలికలకు చలికాలంలో శ్వాసకోశ సంబంధిత ఇబ్బందులు ఎదుర్కొనే మెడికల్ హిస్టరీ ఉందని, వారికి ఆసుపత్రిలో ఆక్సిజన్ అందిస్తున్నామన్నారు. ఆసుపత్రిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన అధికారిని ఇన్‌చార్జిగా నియమించి బాలికలకు అందిస్తున్న చికిత్సను పర్యవేక్షిస్తున్నామన్నారు. విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పామన్నారు. విద్యార్థినులు ఒకేసారి అస్వస్థతకు గురి కావడానికి గల కారణాలను విచారిస్తున్నామన్నారు. పాఠశాలకు సమీపంలోని డంపింగ్ యార్డ్‌ను తరలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని మంత్రి తెలిపారు. విద్యార్థినులు క్షేమంగా ఉన్నారని, వారు పూర్తిస్థాయిలో కోలుకునే వరకు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది వైద్యులు, కలెక్టర్ నిరంతరం పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు. ఆయన వెంట కలెక్టర్ కోయ శ్రీహర్ష, పెద్దపల్లి ఆర్డీవో బి గంగయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ ఉన్నారు.

విత్తనం... వ్యవసాయానికి మూలాధారం. మేలురకం కంకులను, కాయలను భద్రపరుస్తూ విత్తనంగా వాడుకోనేవారు. ప్రస్తుతం రసాయనిక ఎరువులు, వాతావరణ కాలుష్యంతో నేలసారం తగ్గిపోతోంది. ఈనేపథ్యంలో రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారిస్తున్నారు. సేంద్రియ ఎరువుల వాడకంతో దేశీయ వరి వంగడాలను రూపొందిస్తున్నారు. ఈ కోవకు చెందినవారే పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన యాదగిరి శ్రీనివాస్. ఇప్పటి రైతులకు దేశీయ వ్యవసాయ విధానాలను, సేంద్రియ ఎరువుల ప్రాధాన్యాన్ని పరిచయం చేస్తూ పలువురి ప్రశంసలందుకుంటున్నాడు.



శ్రీనివాస్ రూపొందించిన దేశీయ విత్తన కంకులు

ప్రకృతి వ్యవసాయానికి 'బీజం'

- మేలు రకం విత్తనాల ఉత్పత్తి
- సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు
- దేశవాళీ విత్తన ప్రేమికుడు ఏవో యాదగిరి శ్రీనివాస్

రామగిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన యాదగిరి శ్రీనివాస్ దేశవాళీ విత్తనోత్పత్తి ప్రేమికుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. వ్యవసాయంపై ఏర్పడిన మక్కువ అతడిని వ్యవసాయ విద్య వైపు మళ్లించింది. జగిత్యాలలోని పొలాసలో డిప్లొమా కోర్సు పూర్తి చేసి వ్యవసాయ విస్తరణ అధికారిగా 2011లో ఉద్యోగం సాధించాడు. 2016 నుంచి మేలు రకం విత్తనాలను సేకరించడం ప్రారంభించాడు. ఖాళీ సమయాల్లో వ్యవసాయ క్షేత్రంలో దేశీయ విధానంలో వరి సాగు చేపట్టాడు. గ్రామంలో తనకున్న రెండెకరాల్లో దేశవాళబియ్యా విత్తనోత్పత్తి ప్రారంభించి పలువురి ప్రశంసలందుకున్నాడు. సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయ విధానం శ్రీనివాస్‌ను ఆకర్షించింది. దేశీయ వరి రకాల ఉత్పత్తికి కృషి చేసినందుకు రైతు నేస్తం ఫౌండేషన్ వారు 'ఉత్తమ రైతు' అవార్డును శ్రీనివాస్‌కు అందజేశారు. 2024 సంవత్సరానికి గాను బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో 'కర్షక రత్న' అవార్డును అందుకున్నాడు. రైతులకు దేశీయ వ్యవసాయ విధానాలను, సేంద్రియ ఎరువుల ప్రాధాన్యాన్ని రైతులకు పరిచయం చేస్తున్నాడు.. ఆదిలాబాద్ జిలాల్లో ఏవోగా పని చేసేవాడు. ఏడాది కాలంగా దీర్ఘకాలిక సెలవులో ఉన్నాడు.




దేశవాళీ రకంతో సాగైన వరి, ట్రేలలో మొలకెత్తిన వరి



'ఉత్తమ రైతు' అవార్డు అందుకుంటున్న యాదగిరి శ్రీనివాస్

శ్రీనివాస్ ఉత్పత్తి చేస్తున్న దేశీయ వరి వంగడాలు..

- మాపీలై సాంబా, కులకార్, పుంగార్, బహూరూపి, బేళనాళ, నవారా, బర్మాబ్లాక్



దేశీయ వంగడాలతో 'ప్యాడీ ఆర్ట్'

ప్యాడీ ఆర్టిస్ట్‌గానూ..

దేశవాళీ వరి విత్తనాలతో ప్యాడీ ఆర్ట్ విధానాన్ని శ్రీనివాస్ అనుసరించారు. నల్లని వరిని వివిధ రూపాల్లో తీర్చిదిద్దడం 'ప్యాడీ ఆర్ట్'గా ప్రాచుర్యం పొందుతున్నాయి. జపాన్‌వంటి దేశాల్లో పాడీ ఆర్ట్ పేరున ప్రతి సంవత్సరం ఉత్సవాలు జరుపుకుంటున్నారు. దీన్ని అధ్యయనం చేసి తన పంట పొలంలో 'కాలాబట్టి' వరి విత్తనంతో గోమాత, అయోధ్య రామమందిరం ఆకారంలో సాగు చేసి శ్రీనివాస్ ప్రత్యేక తను చాటుకున్నాడు.. ఈ ఏడాది భారతదేశ పటాన్ని, 29 రాష్ట్రాలను తీర్చిదిద్దాడు.




మార్కెట్‌లో దీపావళి సందడి



ప్రమిదల కొనుగోలుతో సందడిగా మారిన మార్కెట్ రోడ్

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దీపావళికి వారం రోజుల ముందు నుంచే మార్కెట్‌లో సందడి నెలకొంది. రకరకాల ప్రమిదలు, అలంకరణకు బొమ్మలు, పూజల కోసం గుమ్మడికాయలు, పూజా సామగ్రి అమ్మకాలు జోరందుకున్నాయి. విభిన్న ఆకృతుల్లో ప్రమిదలు అమ్మకాలకు ఉంచారు. లక్ష్మి, గణేశుడు, ఓంకారం, స్వస్తిక్, జ్యోతి, ఆకు, చేయి, నమస్కారం, కన్ను, దేవతా రూపాలు, పుష్పాల ఆకృతిలో ఉన్న ప్రమిదలే కాకుండా పలు డిజైన్లలతో తయారు చేసిన ప్రమిదలు ఆకట్టుకుంటున్నాయి. ప్రమిదలు ఐదు రూపాయల నుంచి 500 వరకు ధర పలుకుతున్నాయి.

వివిధ సైజుల్లో వత్తులు, నువ్వుల నూనె అమ్ముతున్నారు. ముగ్గుల సాంచెలు 20 రూపాయలకు ఒకటి చొప్పున అమ్ముతున్నారు. పూజల్లో ఉపయోగించేందుకు గుమ్మడి కాయలకు గిరాకీ పెరిగింది. గుమ్మడి కాయలు 80 నుంచి 120 రూపాయలకు ఒకటి చొప్పున పలుకుతున్నాయి. బొమ్మలు 50 నుంచి 100 రూపాయల వరకు ధర పలుకుతున్నాయి. ఢిల్లీ నుంచి తెచ్చిన ప్రత్యేకంగా తెచ్చి పొట్టి శ్రీరాములుచౌక్ వద్ద అమ్ముతున్న బొమ్మలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఉత్పత్తి, దిగుమతి రేట్లు పెరగడంతో ధరలు పెంచక తప్పలేదని వ్యాపారులు అంటున్నారు. వినియోగదారులు మాత్రం ధరలు పెరిగినా కొనక తప్పడం లేదని వాపోతున్నారు. ప్రధానంగా అమ్మకాలు టవర్‌సర్కిల్, మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయం, జగిత్యాల రోడ్, శనివారం మార్కెట్, చిన్న షాపులు, ఆలయాల ప్రాంతాల్లో కొనసాగుతుండగా బండ్లు, రిక్షాల్లో పెట్టి అమ్మకాలు జరుపుతున్నారు.




అమ్మకానికి సిద్ధంగా ఉన్న ప్రమిదలు



వివిధ రకాల ముగ్గుల రంగులు



రేపు ధన్‌తేరాస్

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దీపావళి వేడుకల ప్రారంభ రోజు ధన్ తేరాస్ (ధన త్రయోదశి) బుధవారం జరుపుకోనున్నారు. ఈ రోజు బంగారం కొనుగోలు చేయడం ఆచారం. దీంతో బంగారం దుకాణాలు, జువెల్లరీ షాపుల్లో కొనుగోలుదారుల సందడి నెలకొంది. ఆభరణాలను స్థాయిలకు తగ్గట్టుగా కొనుగోలు చేస్తున్నారు. త్రయోదశి నుంచి 3 రోజుల వరకు లక్ష్మీదేవికి, కుబేరుడికి అభిషేక అర్చనాదులు జరుపుతారు. వస్త్ర, వ్యాపార, వాణిజ్య నిలయాలను, కార్యాలయాలను శుద్ధి చేసి రంగులు వేస్తారు. మామిడి తోరణాలు, పసుపు, కుంకుమ, పూలు, విద్యుద్దీపాలతో అలంకరిస్తారు. పూజా మందిరాలను, దేవుడి పటాలకు అలంకారాలు చేస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు కోట్ల వరకు వ్యాపారం జరుగనున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

రాజన్న ఆలయంలో
నరకచతుర్దశి ప్రత్యేక పూజలు



వేములవాడ కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో నరకచతుర్దశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31న ఉదయం 3.30 గంటల నుంచి 3.40 గంటల వరకు మంగళవాయిద్యములు, 3.40 గంటల నుంచి 4.20 వరకు సుప్రభాత సేవ, 4.20 నుంచి 4.30 వరకు సుప్రభాత హారతి, 4.30 నుంచి 4.40 వరకు నరక చతుర్దశి, దీపావళి పండగ సందర్భంగా మంగళహారతి నిర్వహించనున్నారు. ఉదయం 4.40 గంటల నుంచి 5 వరకు ఆలయశుద్ధి, 5 గంటల నుంచి స్వామి వారికి ప్రాతఃకాల పూజ చేపట్టనున్నారు. సాయంత్రం 4 గంటలకు నరకాసుర వధ పురాణకాలక్షేపము, 6.30 గంటలకు స్వామివారి కల్యాణ మండపంలో ధనలక్ష్మీ పూజ నిర్వహిస్తారు. అనంతరం స్వామివారి పెద్ద సేవ చేపట్టనున్నారు.

కార్తీక మాసం పూజలు..

కార్తీక మాసం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో నవంబరు 2వ తేదీ నుంచి డిసెంబరు 1 వరకు స్వామి వారి కల్యాణ మండపంలో కార్తీక ప్రవచనము నిర్వహించనున్నారు. ప్రతీ సోమవారం స్వామి వారికి అనుబంధ పరివార దేవతలకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, లింగార్చన నిర్వహించున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రతి సోమవారం, ఏకాదశి పౌర్ణమి రోజుల్లో సత్యనారాయణస్వామి వ్రతం ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 1 గంటలకు నిర్వహించనున్నారు. 13న కార్తీక శుద్ధ ద్వాదశి సందర్భంగా ఉదయం 6.30 గంటలకు రుక్మిణి విఠలేశ్వరస్వామి వారికి పంచోపనిష ద్వారా అభిషేకం సాయంత్రం 6.35 గంటలకు శ్రీకృష్ణ తులసీ కల్యాణం నిర్వహిస్తారు. 14న కార్తీక శుద్ధ త్రయోదశి రోజున వైకుంఠ చతుర్దశి సందర్భంగా అనంతపద్మనాభ స్వామికి పంచోపనిషత్ ద్వారా అభిషేకము చేస్తారు. ఉదయం 10 గంటలకు ప్రధాన, పరివార శివాలయములలో అన్నపూజలు, సాయంత్రం 6 గంటలకు అనంతపద్మనాభ స్వామికి అభిషేకము, అనంతరం శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మహాపూజ, పొన్నచెట్టుసేవ ఊరేగింపు చేపట్టనున్నట్లు తెలిపారు. 15న శుక్రవారం కార్తీక పౌర్ణమి రోజున ప్రదోషకాల పూజ అనంతరం రాత్రి 7.30లకు జ్వాలా తోరణము పూజ నిర్వహించనున్నారు. రాత్రి నిశీపూజ అనంతరం రాత్రి 10.15 గంటలకు రాజరాజేశ్వరస్వామికి మహాపూజ ఉంటాయి.

1న బీసీ కమిషన్ పర్యటన

కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వెనుకబడిన తరగతుల కులాల అభివృద్ధి, సామాజిక, రాజకీయ, ఆర్థిక విశ్లేషణ చేసేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ ఈనెల 1న ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తుందని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఒకటో తేదీ ఉదయం 10 గంటలకు బీసీ కమిషన్ చైర్మన్ సమావేశమై అభిప్రాయాలను స్వీకరిస్తారని అన్నారు. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల ప్రజలు హాజరై కమిషన్‌కు తమ అభిప్రాయాలను తెలపాలని కోరారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సంచార జాతుల వారి సామాజిక, రాజకీయ, ఆర్థిక విశ్లేషణపై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తారని అన్నారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ఔత్సాహికులు తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా బీసీ కమిషన్ బృందానికి అందించాలన్నారు. అభ్యర్థనతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన ఫార్మాట్‌ను పూరించి ఆరు సెట్లను కమిషన్ సభ్యులకు అందజేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయం



భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో నిరీక్షిస్తున్న భక్తులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిక్కిరిసింది. సోమవారం తెల్లవారు జాము నుంచే భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకొని ఆలయ ధర్మగుండంతో పవిత్ర స్నానాలను ఆచరించారు. క్యూలో ఆలయంలోకి ప్రవేశించి పార్వతి పరమేశ్వరులను దర్శించకున్నారు. స్వామివారికి కోడె మొక్కును చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా యువత పోరాడాలి

ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్



సభలో ప్రసంగిస్తున్న తిరుమలై రామన్

జ్యోతినగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా యువత పోరాటం చేయాల్సిన అవసరముందని అఖిల భారత యువజన సంఘం(ఏఐవైఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ అన్నారు. రెండు రోజులపాటు ఎన్టీపీసీలో జరుగుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో రామన్ సోమవారం ప్రసంగించారు. నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో మతోన్మాదం పెరిగిందన్నారు. దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ఎన్డీఏ సర్కారు ప్రైవేటు పరం చేస్తోందన్నారు. యువత కేంద్రం కుట్రలను తిప్పికొట్టి ప్రభుత్వ సంస్థలను బలోపేతం చేయాలన్నారు. రెండు రోజుల వర్క్‌షాప్‌నకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో యువత రావడం శుభసూచకమన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాద్రి, నాయకులు ధర్మేంద్ర, శ్రీకాంత్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికిన వారికి జరిమానా

శంకరపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో దొరికిన వారికి హుజూరాబాద్ కోర్టు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. కేశవపట్నం పోలీసులు డ్రంకెన్ నిర్వహించగా ఐదుగురు చిక్కారు. సోమవారం వారిని కోర్టులో ప్రవేశపెట్టగా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఈశ్వరయ్య ఐదుగురికి 5,500 రూపాయల జరిమానా విధించినట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ముగ్గురు విద్యార్థులు

బ్యాడ్మింటన్‌లో సత్తాచాటిన సిరిసిల్ల విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి బాడ్మింటన్ పోటీలలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో డీవైఎస్‌వో అజ్మీరా రాందాసు రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన గోలి శ్రీవాత్సవ్, బూర్ల ఆశిత్, ఆడెపు విగ్నేశ్వర్‌ను అభినందించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి గోలి శ్రీవాత్సవ్ రెండో సారి ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్ర స్థాయి పోటీల ఎంపికకు సెలక్టర్లు ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేయగా అందులో ముగ్గురు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన విద్యార్థులే కావడం విశేషం. బ్యాడ్మింటన్ కోచ్‌లు ఆడెపు గణేష్, హమీద్, డేవిడ్సన్, సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

గణేశ్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. కలువకుంట రామకృష్ణ అన్నారు. సోమవారం కళాశాలలో తెలంగాణా స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా లో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ లక్ష్యాన్ని నిర్దేశించుకొని క్రమశిక్షణ తో సాధన చేస్తూ ఏ ఉద్యోగమైనా అవలీలగా సాధించవచ్చని సూచించారు. భారత్ ఫైనాన్సియల్ ఇంక్లూజన్ సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి నిరుద్యోగులు హాజరైనారు. కార్యక్రమంలో టిఎస్‌కేసి సమన్వయ కర్త ఎన్. శ్రీనివాసులు, భారత్ ఫైనాన్సియల్ ఇంక్లూజన్ సంస్థ ప్రతినిధి పోతినేని శ్యామ్ పాల్గొన్నారు.

జిల్లా జైలును సందర్శించిన న్యాయసేవాధికార సంస్థ సెక్రెటరీ

కరీంనగర్ క్రైం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా జైలును సోమవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె వెంకటేష్ సందర్శించారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ఖైదీలను వారి యోగ, క్షేమాలు, ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఖైదీలకు ఉచిత న్యాయసేవలను అందించేందుకు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్ ఫ్లెక్సీని ఆవిష్కరించారు. అనంతరం జైలులో ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాలు, మౌళిక వసతులు పరిశీలించారు. వివిధ చట్టాలపై అవగాహన కల్పిం చారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ కె శ్రీనివాస్, జైలర్ పి శ్రీనివాస్, రమేష్, డిప్యూటీ జైలర్లు శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రమేష్‌నాయక్, సంగీత పాల్గొన్నారు.

హరిహరనగర్ కాలనీ కార్యవర్గం

కరీంనగర్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 17వ డివిజన్ హరిహరనగర్ కాలనీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పీచర విష్ణుప్రసాద్‌రావు, ప్రధాన కార్యదర్శిగా తివిరిశెట్టి సతీష్‌కుమార్, కోశాధికారిగా పచ్చునూరి రాజేందర్, గౌరవ అధ్యక్షులుగా ఎడమ అజయ్‌కుమార్‌రెడ్డి, జక్కుల జగన్మోహన్, ఉపాధ్యక్షులుగా ముద్రగడ మురళీకృష్ణ, ద్యావ రమణారెడ్డి, ముఖ్యసలహాదారుగా అంబటి వేణుకుమార్, రామ్‌కిషన్‌రావు, జాయింట్ సెక్రటరీగా రేవోజు రాఘవాచారి, తిప్పిరెడ్డి సంపత్‌రెడ్డి ఎన్నికయ్యారు.

‘జూడోలో రాష్ట్ర స్థాయిలో రాణించాలి’



కేక్ కట్ చేస్తున్న జిల్లా జూడో సంఘ ప్రతినిధులు

కరీంనగర్ స్పోర్ట్స్‌అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జూడోలో రాష్ట్ర స్థాయిలో రాణించాలని రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి అన్నారు. ప్రపంచ జూడో క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కరీంనగర్ మంకమ్మతోటలోని సాయి మానేరు పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం ఆధ్వర్యంలో మానేరు విద్యాసంస్థల సౌజన్యంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను జనార్దన్‌రెడ్డి కట్ చేసి క్రీడాకారులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో ఆత్మస్థైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడానికి జూడో క్రీడ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జూడో క్రీడకు విశేష ఆదరణ ఉందన్నారు. ఇటీవల అండర్-14 విభాగంలో ఉమ్మడి జిల్లా జట్టు రాష్ట్ర పోటీల్లో చాంపియన్‌షిప్ కైవసం చేసుకుందన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన జూడో విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్య క్షులు తుమ్మల రమేష్ రెడ్డి, జిమ్నాస్టిక్ సంఘం అధ్యక్షులు నిరంజనా చారి, యోగా సంఘం ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, మానేరు పాఠశాల ప్రిన్సిపాల్ సరితారెడ్డి, వుషు కోచ్ కోడూరి శేఖర్, సుధాకర్‌రెడ్డి, సిలివేరి మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

‘పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి’

కరీంనగర్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా గెలిపిస్తే పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీజేపీ సీనియర్ నాయ కుడు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పొల్సాని సుగుణాకర్‌రావు అన్నారు. సోమవారం నగరంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు నష్టపోతుంటే పట్టించుకోవడం లేదన్నారు. హామీలను విస్మరించిన కాంగ్రెస్ పార్టీ ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని ఎమ్మెల్సీ అభ్యర్థి పొల్సాని సుగుణాకర్ రావు హెచ్చరించారు.

‘ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా’

కరీంనగర్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఉపాధ్యాయులు, అధ్యాపకుల, ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి, మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని పలు ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థలకు వెళ్ళి ఉపాధ్యాయులను మద్దతు ఇవ్వాలని కోరారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 6వరకు ఓటరుగా నమోదు కావాలని కోరారు.

‘ఎమ్మెల్సీగా ప్రసన్న హరికృష్ణ పోటీచేయడం అభినందనీయం’

కరీంనగర్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీగా ప్రసన్న హరికృష్ణ బరిలోకి దిగడం అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం ప్రసన్న హరికృష్ణ గజ్వేల్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేశారు. అనంతరం ఆయన ర్యాలీగా కరీంనగర్‌లోని తెలంగాణచౌక్‌కు చేరుకున్నారు.

అనంతరం పద్మనాయక కల్యాణ మండపంలో పట్టభద్రులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిం చారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ పట్టభద్రులు ప్రసన్న హరికృష్ణకు మద్దతు పలకాలన్నారు. ప్రసన్న హరికృష్ణ మాట్లాడుతూ పట్టభద్రులు తనకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

'క' సినిమా యూనిట్ సందడి

సుభాష్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): 'క' సినిమా యూనిట్ సోమవారం కరీం నగర్‌లో సందడి చేసింది. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో చిత్ర బృందం మాట్లాడుతూ సినిమాను కర్ణాటకలోని శివమొగ్గ జిల్లాలోని ఓ రిమోట్ విలేజ్ తీర్థహళ్ళి గ్రామంలో చిత్రీకరణ చేశామని తెలిపారు. హీరో కిరణ్ అబ్బవరంకు కరీంనగర్‌తో ఎంతో అనుబంధం ఉందన్నారు. ఈ సమావేశంలో యూనిట్ డీఓపీ సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

తపస్ ఆధ్వర్యంలో వినతిపత్రాల సమర్పణ

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు డీఏ ప్రకటన, పీఆర్‌సీ, పెండింగ్ బిల్లుల విషయంలో ప్రభుత్వం తాత్సార వైఖరిని అవలంబిస్తోందని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్లకు వినతిపత్రాలను సమర్పించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్ట రాజేశ్వర్, అన్నమనేని తిరుపతిరావు, రాష్ట్ర కార్యదర్శి అంబటి వేణుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తపస్ ఆధ్వర్యంలో నవం బర్ 5న కలెక్టరేట్‌ల ముందు ధర్నా, 23న ఇందిరాపార్కు వద్ద ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్షను చేపడుతుందని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాలతో నిర్వహిస్తున్న బ్యూటీషియన్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ నవంబరు 5 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. 18 ఏళ్ల వయస్సు కలిగి పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. నిపుణులచే తరగతుల బోధన ఉంటుందని తెలిపారు.

కల్వర్టు మరమ్మతు పనులు ప్రారంభం

కరీంనగర్ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం చామనపల్లి-ఇరుకుల్ల గ్రామాల రహదారిలో ఎస్సారెస్పీ కాలువపై ఉన్న కల్వర్టుకు గుంత పడగా సోమవారం మరమ్మతు పనులు ప్రారంభించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నిధులు తీసుకువచ్చి చామనపల్లి-ఇరుకుల్ల గ్రామానికి రహదారి నిర్మించారు. రెండు సంవత్సరాల క్రితం కల్వర్టుకు భారీ గుంత పడింది. దీంతో మరమ్మతులకు ఎస్సారెస్పీ మెంటనెన్స్ (ఓఎన్‌యం) నిధులు 4లక్షల రూపాయలు రెండు రోజుల క్రితం మంజూరు కాగా సోమవారం కాంట్రాక్టర్ మరమ్మతు పనులు ప్రారంభించారు.

‘కేటీఆర్‌ను ఎదుర్కోలేకనే అక్రమ కేసులు’



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

కరీంనగర్ టౌన్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీ రామారావును ఎదుర్కొనే సత్తా లేక సీఎం రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో పోలీసులు కేటీఆర్ బావమరిదిపై అక్రమ కేసులు బనాయించారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా మాజీ చైర్మన్ జీవీ రామకృష్ణారావు విమర్శించారు. కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ కేసు పూర్వపరాలు తెలుసుకోకుండా కేసీఆర్, కేటీఆర్ కుటుంబంపై డ్రగ్స్ తీసుకున్నారంటూ ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. సోమవారం నగరంలోని ఓ హోటల్‌లో మీడియా సమావేశంలో జీవీ రామకృష్ణారావు మాట్లాడుతూ కేటీఆర్ బావమరిది కుటుంబసభ్యులతో కలిసి ఏర్పాటు చేసుకున్న పార్టీలో కేటీఆర్ సమీప బంధువులైన మహిళలు, పిల్లలు, కుటుంబసభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారన్నారు. దీన్ని రేవ్ పార్టీగా చిత్రీకరించడం విచారకరమని ఖండించారు. అసలు రేవ్ పార్టీకి, కుటుంబసభ్యులు చేసుకునే పార్టీకి తేడా ఎలా ఉంటుందో కేంద్రమంత్రి సంజయ్‌కి తెలుసా అని ప్రశ్నించారు. కేటీఆర్‌ను నేరుగా ఎదుర్కోలేక బండి సంజయ్‌కుమార్ మహిళలపై పిచ్చిప్రేలాపణలు చేశారన్నారు. కరీంనగర్ ఎంపీగా మానేరు రివర్ ఫ్రంట్ పూర్తయ్యేందుకు కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని, హైడ్రా, మూసీపై స్పందించాలని సంజయ్‌కి సూచించారు. కేసీఆర్, కేటీఆర్ కుటుంబంపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని మహిళలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈవిలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, సుడా మాజీ డైరెక్టర్లు, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్



కిషన్



రాంకిరణ్

సుభాష్‌నగర్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఆదివారం 2024-25 సంవత్సరానికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని కరీంనగర్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్, కార్యదర్శి డాక్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎలెక్ట్‌గా జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ మానసిక వైద్యనిపుడు డాక్టర్ పి.కిషన్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎంఎల్ఎన్‌రెడ్డి, జాయింట్ సెక్రె టరీగా డాక్టర్ పొలాస రాంకిరణ్, సెంట్రల్ కౌన్సిల్ మెంబర్‌గా డాక్టర్ రాజేశ్వర్, స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా డాక్టర్ అలీంలను ఎన్నుకున్నారు.

బ్యాడ్మింటన్‌లో ట్రినిటి విద్యార్థిని ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) సికింద్రాబాద్‌లోని వివి స్పోర్ట్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో జరిగే రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ట్రినిటి కళాశాల విద్యార్థిని పొలిమెట్ల వైష్ణవి ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల వ్యవస్థాపకులు దాసరి మనోహర్ రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి అభినందించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



హుజూరాబాద్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

హుజూరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించి తహసీల్దార్ కనకయ్యకు వినతి పత్రం అందజేశారు.

● చొప్పదండి: పెండింగ్‌లోఉన్న ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్ షిప్‌లను నిధులను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ ఎమ్మెల్యే మెడిపల్లి సత్యంకు సోమవారం వినతిపత్రం అందజేశారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని తొమ్మిది గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సోమ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి రైతులు లబ్ధి పొందాలని సూచించారు. అనంతరం మండలంలోని గోపాల్‌రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 175 మంది విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మ న్ బొమ్మరవేణి తిరుమల, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతి, కొక్కెరకుంట, రామడుగు విండో చైర్మన్లు మురళీకృష్ణారెడ్డి, వెంకటే శ్వరరావు, ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, ఉప్పుల అంజలి ప్రసాద్, కోల రమేష్, ఎంఈవో వేణుకుమార్ పాల్గొన్నారు.

● వీణవంక: మండలంలోని చల్లూరు, మామిడాలపల్లి, కనపర్తి, వీణవంక, ఇప్పలపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ముదిగంటి శ్యాంసుందర్‌రెడ్డి, బండ కిషన్‌రెడ్డి, పర్లపల్లి రమేష్, ఏపీఎం కొమురయ్య పాల్గొన్నారు.

● సైదాపూర్: మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ మంజుల ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, ఏపీఎం కుమారస్వామి, చైర్మన్ శైలజ, వైస్ చైర్మన్ మాలతి పాల్గొన్నారు.

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రంగాపూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని హుజూరాబాద్ పీఏసీఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండాల్‌రెడ్డి ప్రారంభించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

మానకొండూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఊటూర్‌లో మార్నింగ్ వాక్‌లో భాగంగా సోమవారం ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. మురికి కాల్వలలో పిచ్చి మొక్కలు పెరిగి నీరు నిల్వ ఉండడంతో దోమలు తయారు రోగాల బారిన పడుతున్నామని కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మురికి కాల్వలలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు, ఉపాధ్యక్షులు రామిడి తిరుమల్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి తాల్లపల్లి సంపత్, మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, మాజీ సర్పంచు గోపు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

‘ఎరుకలు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలి’

మానకొండూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎరుకల కులస్థులు ఐక్యం గా ఉండి హక్కులు సాధించుకోవాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు పిలుపునిచ్చారు. మానకొండూర్‌లో ఎరుకల సంఘం ఆధ్వర్యంలో మండల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఎరుకల కులస్తులపై జరుగుతున్న దాడులపై ఉద్యమించాలని సూచించారు. కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షుడు రాయలింగం, మండల అధ్యక్షుడు సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షులు బాలయ్య, జాంతు రాజేశం పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలి



బహుమతి ప్రదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

చిగురుమామిడి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణా క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. సోమ వారం మండల కేంద్రంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. విజేతగా నిలిచిన కోహెడ జట్టుకు, రన్నరప్‌గా నిలిచిన సుందరగిరి జట్లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగ సంవత్సరాలుగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కొత్త వినీతను ఆయన అభినందించారు. కార్యక్రమంలో మామిడి అంజయ్య, సాంబారి కొమురయ్య, పెనుకుల తిరుపతి, ముక్కెర సదా నందం, సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

● హుస్నాబాద్ నాయకులను చిన్నచూపు చూస్తున్న మంత్రి

హుస్నాబాద్ నాయకులను మంత్రి పొన్నం ప్రభాకర్ చిన్నచూపు చూస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడి నాయకుల కృషితో గెలిచి కరీంనగర్ నాయకులకు ప్రాధాన్యం ఇస్తున్నాడని ఆరోపించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించి, ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో మాజీ ఎంపీపీ కొత్త వినీత శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, నాయకులు పాల్గొన్నారు.

కేంద్రాలు తెరిచారు.. కొనుగోళ్లు మరిచారు

(5వ పేజీ తరువాయి)

బోనస్‌ను రాష్ట్రంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇవ్వనున్నది.

● ధాన్యం తరలింపుపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం

గతంలో ఏ కొనుగోలు కేంద్రం ధాన్యం ఏ రైస్‌మిల్లుకు వెళ్లాలి అనే విషయాన్ని 15 రోజుల ముందే నిర్ణయించేవారు. కస్టమ్ మిల్లింగ్ రేటు, బియ్యం ఇవ్వాల్సిన పరిమాణం విషయంలో రైస్‌మిల్లర్లకు, ప్రభుత్వానికి అవగాహన కుదరలేదు. కస్టమ్ మిల్లింగ్ చేసే మిల్లర్లు వారికి కేటాయించే ధాన్యానికి సరిపడే విలువకు బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలని ప్రభుత్వం నిబంధన విధించింది. దీనికి రైస్ మిల్లర్లు ఒప్పుకోకపోవడంతో ప్రతిష్ఠంభన నెలకొంది. కొన్న ధాన్యం ఎక్కడికి తరలించాలో తెలియకపోవడంతో కొనుగోళ్లను ప్రారంభించలేదని నిర్వాహకులు అంటున్నారు. మరో 15 రోజుల్లో వరి కోతలు 90 శాతం పూర్తవుతాయి. అయినా కొనుగోళ్ల ప్రారం భం కాకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నది. మరోవైపు ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకొని రైసుమిల్లర్లు, ఇతర వ్యాపారులు క్వింటాల్‌కు 1800 నుంచి 1900 రూపాయలకు కల్లంలోనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. క్వింటాల్‌కు సగటున 300 రూపాయల వరకు నష్టపోవలసి వస్తున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే కొనుగోళ్లను ప్రారంభించి తమకు మద్దతు ధర దక్కేలా చూడాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

● తూకం వేయడం లేదు..

-తిరుపతి, రైతు, గునుకుల కొండాపూర్



కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకువచ్చి పదిరోజులవుతుంది. ధాన్యాన్ని తూకం వేయడం లేదు. సెంటర్‌కు తీసుకురాకుండా ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటే తొందరగా డబ్బులు వస్తుండే... ఇక్కడ సెంటర్ వాళ్ల కొనరు... బయట అమ్ముకోరాదు..

● వర్షం కురిస్తే ఇబ్బంది అవుతుంది..



- తాళ్లపల్లి శ్రీనివాస్, జూపాక

ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలి. వర్షాలు కురిస్తే ధాన్యం తడిసి ఇబ్బందవుతుంది. మా బాధలను ప్రభుత్వం అర్థం చేసుకోవాలి.

ఎమ్మెల్యే గంగులకు పరామర్శ

కరీంనగర్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను సోమవారం పలువురు నేతలు పరామర్శించారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, వాటర్ రిసోర్స్ పర్సస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాష్, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, మాజీ చైర్మన్ వావిలాల హన్మంతరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణ, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య తదితరులు లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

● సంక్షిప్త సమాచారం..

●కరీంనగర్ కల్చరల్: కరీంనగర్‌కు చెందిన రచయిత వైరాగ్యం ప్రభాకర్, చిత్రకారుడు, గాయకుడు రాపర్తి వేంకటేశ్వర్లకు ఆదివారం హైదరాబాద్ త్యాగరాయ గాన సభ వేదికగా హోప్ స్వచ్ఛందసంస్థ సేవా సమితి, సింధు ఆర్ట్స్ అకాడమీ సూర్యాపేట వారు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ స్ఫూర్తి పురస్కారాలు అందజేశారు.

-భారతీయ సంస్కృతిని విచ్ఛిన్నం చేసేందుకు ఎన్నో ఏళ్ళుగా కుట్రలు జరుగుతున్నాయని, వాటిని తిప్పి కొట్టేందుకు అందరూ సంఘటితం కావాలని అంతర్జాతీయ విశ్లేషకుడు గిరిధర్ మామిడి అన్నారు. సోమవారం బృందావన్ గార్డెన్‌లో ప్రజ్ఞా భారతి ఆధ్వర్యంలో 'వ్యాపారం పేరుతో దేశంపై కార్పొరేట్ శక్తుల కుట్రలు' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు నాగేశ్వరరావు, అతిథిగా ఏఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేశ్, డి నిరంజనాచారి, మండల నగేశ్‌రెడ్డి, దేశిని శ్రీనివాస్, ఎలగందుల సత్యనారాయణ, జె సత్యనారాయణరెడ్డి, మురళి, నగరవాసులు పాల్గొన్నారు.

●సుభాష్‌నగర్: గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల ఎన్నిలను రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి నిర్వహించాలని జిల్లా గొర్రెల మేకల పెంపకందారుల సహకార యూనియన్ మాజీ డైరెక్టర్ కడారి అయిలయ్య కోరారు. ఈమేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు.

●కరీంనగర్ టౌన్: పార్టీ సభ్యత్వ నమోదును ముమ్మరంగా చేపట్టి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తెచ్చే లక్ష్యంగా సభ్యత్వ నమోదు చేస్తామని టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు వంచ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

-నగరంలోని 45వ డివిజన్ కార్పొరేటర్ పిట్టల వినోద శ్రీనివాస్‌ను మేయర్ యాదగిరి సునీల్‌రావు పరామర్శించారు. కార్పొరేటర్ అత్తమ్మ పిట్టల రాజమ్మ మృతికి సంతాపం తెలుపుతూ ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.

●గణేశ్‌నగర్: శివాని కళాశాలలో బీబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న శివరామకృష్ణ నేవీలో ఉద్యోగ సాధించినందుకు సోమవారం శివాని కళాశాల యాజమాన్యం కళాశాల ప్రిన్సిపాల్ వంగపల్లి ఉమాదేవిసతీష్‌లు అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మునిందర్, ప్రసాద్ పాల్గొన్నారు.

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలో జరగనున్న ఎస్‌జీఎఫ్ 68వ అండర్-17 బాలుర జూడో చాంపియన్‌షిప్ పోటీలకు నగరంలోని జ్యోతినగర్‌లోని సాధన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు చెందిన విద్యార్థులు ఎన్ హర్ష, ఎస్ సుజల్ ప్రీతమ్ ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు గోలి నరేందర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ సీహెచ్ శ్రీనివాస్‌రావు అభినందించారు.

● జమ్మికుంట: తమ వీధి దారిపై ఇంటి నిర్మాణం చేపట్టిన పెద్దులు అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణంలోని దుర్గాకాలనీకి చెందిన జి వెంకటలక్ష్మి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

-జమ్మికుంట ప్రైవేట్ టీచర్స్ యూనియన్ అధ్యక్షుడు పల్లె రామిరెడ్డికి ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం వచ్చింది. దీంతో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు.

● ఇల్లందకుంట: ప్రజా సంఘాల సమన్వయ కమిటీ ఇల్లందకుంట మండల కన్వీనర్‌గా చెల్పూరి రాము సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా తిప్పరబోయిన శ్రీకాంత్, సంతోష్, మల్లయ్య, ఓదెలు, రాజేందర్, సంపత్, మల్లేష్, రవిని ఎన్నుకున్నారు.

● హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 12 ఏళ్ల లోపు విద్యార్థులకు గంగిశెట్టి జగదీశ్వర్ ఉచిత బస్‌పాస్‌ను అందజేశారు.

- పట్టణంలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేసినట్లు బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు మోరె మధు తెలిపారు.

- పాలసీ పునర్నిర్మాణం మధ్య కమిషన్ కోతలు, క్లాబ్యాక్ క్లాజును రద్దు చేయాలంటూ ఏజెంట్లు ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు.

● శంకరపట్నం: తెలంగాణ రాష్ట్ర సంక్షేమ బోర్డు లేబర్ ఆఫీస్ హైద్రాబాద్ ఆన్‌లైన్ రెండు నెలలుగా పనిచేయడం లేదని తెలంగాణ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

- దీపావళి పండుగను పురస్కరించుకొని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక హుజూరాబాద్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మండలంలోని తాడికల్ గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు.

- ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళితుల ఐక్యత కోసం మాలల మహా పాదయాత్రను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య మాలలకు పిలుపునిచ్చారు.

- మండలంలోని తాడికల్ గ్రామంలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించామని ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

- మండలం కేశవపట్నంలో ఇందిరా మహిళా శక్తి గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ షాపును ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్ పరిశీలించారు.

● మానకొండూర్: ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వర్ణ వెంకటరెడ్డి అన్నారు. మానకొండూర్‌లో మండల సభను శాతరాజు భద్రయ్య అధ్యక్షతన నిర్వహించారు.

● చిగురుమామిడి: ఇందిరమ్మ ఇళ్లలో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్లు కేటాయించాలని వికలాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కన్వీనర్ కంది నాగరాజు ప్రజావాణిలో కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు.

● గంగాధర: మత్తుకు బానిసై విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకొవద్దని కరీంనగర్ ఎక్సైజ్ ఎస్‌ఐ వినయ్‌భాస్కర్ అన్నారు. ం గంగాధర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మదకద్రవ్యాల వినియోగంతో జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

● గన్నేరువరం: మండలంలోని బాలికల గురుకుల పాఠశాల, ఎస్‌ఆర్‌కే పాఠశాలలో కాన్సియస్నెస్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు.

●భగత్‌నగర్: కొత్తపల్లి తహసీల్దార్‌కు తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజేశ్వర్, తిరుపతిరావులు వినతిపత్రం అందించారు.